ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ జిల్లా వార్తలు


శుక్రవారం 30 మే 2025 | 5

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31(గురువారం)
కనిష్ఠం : 28

ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ 6

రేపు సీఎం రాక

- కోనసీమ జిల్లా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో అధికారిక కార్యక్రమాలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లు చేస్తున్న కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం
- సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల



అమలాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 31న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4లో భాగంగా పేదల దత్తత కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉపాధి హామీ కూలీలతో మమేకమవుతారు. నలుగురు పెన్షనర్లతో మాట్లాడతారు. తర్వాత ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

సీఎం పర్యటన సాగేదిలా..

- ఆరోజు ఉదయం 9.30గంటలకు ఢిల్లీలోని జనపథ్ నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.10గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరతారు.
- 12.25 గంటలకు రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరతారు.
- 12.50గంటలకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.50 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంను కలుస్తారు.
- 1.20 గంటలనుంచి 2.05గంటల వరకు పీ4 కార్యక్రమంతోపాటు పింఛన్ల పంపిణీ తర్వాత గ్రామస్తులతో భేటీ అవుతారు.
- 2.05 గంటలకు బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి ట్యాంక్ ఏరియాకు చేరుకుంటారు.
- 2.10 గంటల నుంచి 3.30 గంటల వరకు గ్రామంలో ప్రజలతో మాట్లాడతారు.
- 3.35గంటల నుంచి 5 గంటల వరకు అక్కడే టీడీపీ కేడర్‌తో సమావేశమవుతారు.
- 5.10 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో బయలుదేరతారు.
- 6 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని స్వగృహానికి చేరుకుంటారు.

పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
- లారీ సహా రూ.22లక్షల విలువైన 730 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదురోజుల క్రితం దేవరపల్లిలో మోటారుసైకిల్‌ను ఢీకొన్న లారీడ్రైవర్
- పోలీసులకు భయపడి అప్పటినుంచి లారీని యర్నగూడెంలో దాచిన వైనం
- సమాచారంతో పరిసరాల్లో వెతికి లారీని పట్టుకున్న పోలీసులు
- లారీ క్యాబిన్ వెనుక రహస్య అర కింద గంజాయి గుర్తింపు
- లారీడ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు

మెయిన్‌లో..



వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి పోలీసులు



లారీ క్యాబిన్ వెనుక ఏర్పాటు రహస్య అర

కొంచెమే పెంపు

- ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం 7
- క్వింటాలుకు రూ.69 పెంపు
- గ్రేడ్ ఏ రకం రూ.2,369
- సాధారణ రకం రూ.2,252
- ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా

నో..పరేషన్



- ఉమ్మడి జిల్లాలో జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే బియ్యం
- పిఠాపురంలో ప్రారంభించనున్న సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల
- ప్రతినెలా 1వతేదీనుంచి 15తేదీ వరకు దుకాణాల్లో ఇచ్చేలా ప్రణాళిక
- వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇచ్చేలా ఏర్పాట్లు
- పక్కాగా కొత్త విధానం అమలయ్యేలా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,857రేషన్ దుకాణాల్లో 17.46 లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారుల పరిశీలన
- ఎండీయూ వాహనాల రద్దుతో ఇకపై కార్డుదారులకు తీరిన కష్టాలు
- నచ్చినప్పుడు రేషన్‌డీలర్ వద్దకు వెళ్లి బియ్యం, సరుకులు తెచ్చుకునే వీలు
- గత ప్రభుత్వంలో బియ్యం వాహనాలతో కార్డుదారులకు నరకం
- ఎప్పుడు బియ్యం బండి వస్తుందో తెలియక పడిగాపులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

'ఎప్పుడు వస్తుందో తెలియదు.. ఎక్కడ ఉంటుందో తెలియదు.. ఎంతసేపు ఉంటుందో తెలియదు.. ఒకచోట మిస్సయితే.. మరో చోటకు వెళ్లి తెచ్చుకోవాలి. ఒక్కోసారి వాహనం కనిపించినా.. గంటల తరబడి సరకుల కోసం పడిగాపులు.. ఒక్కోసారి బియ్యం లేవనే సమాధానం..' గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ సరకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలతో రేషన్ కార్డుదారుల అనుభవాలివీ.. వీటన్నింటికీ చెక్ పెడుతూ.. కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక జూన్ ఒకటో తేదీ నుంచి నేరుగా రేషన్ దుకాణాల నుంచే సరకులు పంపిణీ చేసేలా ఏర్పాటు చేస్తోంది. వైసీపీ హయాంలో ఇంటింటికి రేషన్ సరకులు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం.. కార్డుదారులను నడి వీధిలో నిలబెట్టింది. ఈ సమస్యను చక్కదిద్దేందుకు కూటమి సర్కారు పాత విధానంలోనే రేషన్ దుకాణాల వద్దే సరకులు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,857 రేషన్ దుకాణాల్లో 17.46లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పక్కాగా సరఫరా చేసేలా డీలర్లను అప్రమత్తం చేసింది. రేషన్‌దుకాణాల్లో తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

బెంగ లేదిక..

జూన్ 1 నుంచి రేషన్‌దుకాణాల్లో బియ్యం పంపిణీ నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాలశాఖల అధికారులు రేషన్ దుకాణాలకు సరకుల తరలింపు, కచ్చితమైన తూకంతో పేదలకు అందించే చర్యలు మొదలుపెట్టారు. ఎంఎల్ఎస్ పాయింట్లు వద్ద వే బ్రిడ్జిలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. మరో మూడురోజులు మాత్రమే సమయం ఉండడంతో రేషన్ షాపులను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రేషన్ సరకుల సరఫరాలో లోటుపాట్లపై డీలర్ల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇక తూనికలు, కొలతలశాఖల అధికారులు కూడా రేషన్ దుకాణాల్లోని కచ్చితమైన తూకాలు ఉండేలా యంత్రాలను పరిశీలిస్తున్నారు. చాలా వరకు డీలర్ల వద్ద ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు పాడైపోయిన నేపథ్యంలో వాటిని మరోసారి తనిఖీ చేసి, సీల్ వేస్తున్నారు. ఈ పనిలో ఐదురోజులుగా ఈ శాఖ అధికారులు బిజీగా ఉన్నారు. ఈనెల 30వ తేదీలోపు మొత్తం రేషన్ దుకాణాలన్నింటికీ సరకును రవాణా చేసేలా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వైసీపీ హయాంలో..

కాగా రేషన్ బియ్యాన్ని నెలలో తనకు కావలసిన సమయంలో కార్డుదారులు రేషన్ దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం 2019 వరకు అమలవగా తర్వాత జగన్ వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచారు. నచ్చిన రోజు, నచ్చిన సమయానికి రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకునే వెసులుబాటును రద్దు చేసి కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి వెళ్లి ఈ వాహనంలో బియ్యం పంచుతామని చెప్పి మాట మార్చారు. ఒక కాలనీకి వెళ్లి ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీవాసులు నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆరోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయిన పరిస్థితి తలెత్తింది. వేరే ప్రాంతంలో వాహనం కనిపిస్తే బియ్యం ఇచ్చేవారు కాదు. బియ్యం ఇచ్చినట్లే ఇచ్చి అక్కడే తిరిగి కొనేవారు. ఈ రేషన్ బియ్యం అంతా తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్‌మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి. రేషన్ మాఫియాకు ఇవి అడ్డగోలుగా ఉపయోగపడ్డాయి. బియ్యం వాహనాలను అప్పటి ప్రభుత్వం రూ.5.81లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72నెలల వాయిదాపై బ్యాంకునుంచి 2021, ఫిబ్రవరిలో రుణం తీసుకుంది. కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19కోట్లు రుణం ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పటికీ ఈరుణాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ వాహనాలపై రూ.6.83కోట్లు బాకీ ఉంది.



కాకినాడ రంగయ్యనాయుడు వీధిలోని ఓ రేషన్ దుకాణంలో తూకపు యంత్రాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

ఏం జిల్లాలో ఎన్నంటే..

కాకినాడ జిల్లాలో 1,060రేషన్ దుకాణాలు ఉండగా, వీటి పరిధిలో 6.43లక్షలమంది కార్డుదారులున్నారు. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38లక్షలమంది, తూర్పుగోదావరి జిల్లాలో 871దుకాణాల ద్వారా 5.65లక్షల మంది కార్డుదారులున్నారు. వీరందరికీ ఉమ్మడి జిల్లాలో 26లక్షల మెట్రిక్ టన్నుల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ మేరకు అన్ని రేషన్ దుకాణాల్లో ఈ వ్యవస్థ పక్కాగా పనిచేసేలా మూడు జిల్లాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కార్డుదారులు నచ్చిన సమయంలో బియ్యం విడిపించుకునేందుకు వీలుగా 15రోజులపాటు దుకాణాల్లో బియ్యం ఉండేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో ఈ నెల ఒకటి నుంచి 15 వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ దుకాణాలు తెరిచి ఉంచనున్నారు. షాపు పనివేళలు, ధరలు, సరకు నిల్వను సూచించే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇప్పటికే డీలర్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. ఇక 65ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తవ్వేదెవరు

- జిల్లాకు కేటాయించిన ఇసుక ర్యాంపుల వెనుక ఎవరున్నారు
- కాంట్రాక్టు కంపెనీ కాకుండా ఇంకెవరు పెత్తనం చేస్తున్నారు
- ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఇసుకాసురుడు' కథనంపై కాకినాడ కలెక్టర్ ఆరా
- స్టాకు యార్డులకు ఇసుక రాకుండా అడ్డుకునే ప్రయత్నాలపై ఆగ్రహం
- ఎప్పటికప్పుడు స్టాకు యార్డులకు వస్తోన్న ఇసుకపై పర్యవేక్షణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా ఇసుక అవసరాలు తీర్చడానికి కేటాయించిన ర్యాంపుల్లో వైసీపీ నేత ద్వారంపూడి అనుచరుడి పెత్తనంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆరా తీశారు. కోనసీమ జిల్లాలోని పొడగట్లపల్లి, తూర్పుగోదావరిజిల్లాలో కాటవరం ర్యాంపులు అధికారికంగా కాంట్రాక్టు కంపెనీలకు కేటాయిస్తే వీటిలో వేరొకరు పాగా వేసి ఇసుక అక్రమాలు చేస్తుండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు తెరవెనుక దందా చేస్తోన్న నేత గురించి ఆరా తీశారు. రీచ్‌లు దక్కించుకున్న కంపెనీలకు, సదరు చీకటి నేతకు సంబంధాలేంటనేదానిపై కలెక్టరేట్ అధికారుల ద్వారా లోతుగా గుట్టు సేకరించారు. రీచ్‌లపై అనధికార వ్యక్తుల పెత్తనం సహించేదిలేదని అధికారులవద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటి పేరుగా మార్చుకున్న వైసీపీ నేత చెలరేగిపోయాడు. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో గ్రావెల్ అక్రమాలకు తెగబడ్డాడు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అదే నేత ఇంకా దందాలు చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'ఇసుకాసురుడు' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై కాకినాడ కలెక్టర్ ఆరాతీశారు. జిల్లాలో ఇసుక స్టాకుయార్డులకు రీచ్‌ల నుంచి ఇసుక ఇవ్వకుండా ద్వారంపూడి అనుచరుడు బెదిరింపులకు దిగుతున్న వ్యక్తి ఎవరనేదానిపై ఆరా తీశారు. అసలు రీచ్‌ల్లో ఏం జరుగుతుందో వివరాలు రప్పించుకున్నారు. రీచ్‌ల్లో అనధికార వ్యక్తుల పెత్తనం చేస్తే కాంట్రాక్టు రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అసలే వచ్చేది వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి స్టాకుయార్డులోను ఇసుక తగినంత ఉండేలా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ మొదలుపెట్టారు. ప్రస్తుతం జిల్లాలో పెద్దాపురం,పిఠాపురం, కాకినాడ, కాకినాడలో ఉప్పలంక, కాకినాడ అర్బన్, ప్రత్తిపాడు స్టాకుయార్డుల్లో ఈనెల 27నాటికి 1,37,791మెట్రిక్ టన్నులు ఉందని అధికారులు వివరించారు. ఇదిరోజురోజుకు మారుతుందని తెలిపారు. మరోపక్క తమకు దక్కిన రీచ్‌ల వెనుక వైసీపీ నేత పెత్తనం కొనసాగుతుందన్న విషయం బయటకు పొక్కడంతో సదరు నిర్వాహకులు ఆంధ్రజ్యోతి కథనం ఉలిక్కిపడ్డారు. ఏ స్టాకు యార్డు నుంచి నిజాలు బయటకు పొక్కాయి అనేదానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు.

ఆరడుగుల గోధుమ తాచుపాము హల్‌చల్ 7

1 నుంచి చౌకడిపోల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీ

- 15రోజులపాటు నిర్దేశితసమయాల్లో ఇవ్వాలి: డీఎస్వో ఉదయభాస్కర్

అమలాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అనుసరించి రేషన్ డిపోల ద్వారా వినియోగదారులకు నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారి కె.ఉదయభాస్కర్ అన్నారు. జిల్లాలో జూన్ 1 నుంచి చౌకడిపోల ద్వారా రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొన్ని సూచనలు చేశారు. చౌకదుకాణాల ద్వారానే పంపిణీ చేయనున్నందున ప్రజలు గమనించి వాటిని తీసుకోవాల్సిందిగా సూచించారు. జూన్ 1 నుంచి 15 వరకు ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు చౌక దుకాణాలు తెరిచి ఉంచాలని డీలర్లను ఆదేశించారు. పనివేళలు, ధరలు, సరుకు నిల్వలు సూచించే బోర్డులను షాపు ముందు భాగంలో ప్రదర్శించాలని కోరారు. 65ఏళ్ల వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాల్సిందిగా సూచించారు. చౌక దుకాణాల ప్రాంగణాలను శుభ్రంగా ఉంచాలని, ఇ-పాస్, వేయింగ్ మిషన్లు కండిషన్‌లో ఉంచుకోవాలని, కార్డుదారులందరికీ కచ్చితమైన కొలతలతో సరుకులు పంపిణీ చేసి రశీదును ఇవ్వాలని సూచించారు. ఆధార్ సీడింగ్ దిద్దుబాటు, కార్డుల్లో చిరునామాల మార్పులు, బియ్యం కార్డులు సరెండర్‌వంటి సేవలు మీ సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయం నుంచి పొందవచ్చునని డీఎస్వో సూచించారు.

జిల్లాలో వన్‌స్టాప్ సెంటర్లలో పోస్టుల భర్తీకి నోటిషికేషన్

- ఐదోతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి: ఐసీడీఎస్ పీడీ

అమలాపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్‌స్టాప్ సెంటర్‌లో పనిచేసేందుకు కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్‌ను జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ జారీ చేసింది. వన్‌స్టాప్ సెంటర్‌లో మల్టీపర్పస్ స్టాప్ కుక్(ఉమెన్) మూడు పోస్టులు ఉన్నాయని, పదో తరగతి, ఆపై చదువుకున్నవారు 25 నుంచి 42 ఏళ్ల వయసు గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి సూచించారు. నెలకు రూ.13వేల వేతనం అందిస్తారన్నారు. సెక్యూరిటీగార్డు, నైట్‌గార్డు ఉమెన్ పోస్టులు రెండు ఉన్నాయని, రెండేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రూ.15వేల వేతనం అందిస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థినులు జిల్లా వెబ్‌సైట్‌నుంచి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకుని అన్నిరకాల ధ్రువపత్రాల నకళ్లు జతచేసి జూన్ 5లోగా ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ కార్యాలయంలో అందించాలని కోరారు.

పనామా-భారతదేశాల మధ్య..

బంధం మరింత బలోపేతం

- అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం,మే 29(ఆంధ్రజ్యోతి):పనామా-భారతదేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద దుశ్చర్యలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష పార్లమెంటరీ బృందం గురువారం పనామా దేశం చేరుకుంది. ఈ సందర్భంగా పనామా దేశఅధ్యక్షుడు జోస్‌రౌలీములినోతో అఖిలపక్ష బృందం సమావేశమైంది. సమావేశంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు కాశ్మీర్‌లోను, పహల్గాంలో జరిపిన మారణకాండ, మన దేశం చేసిన ఆపరేషన్ సింధూర్ గురించి ఆయనకు వివరించామని ఎంపీ హరీష్ తెలిపారు. ఉగ్రవాదంపై భారత దేశం తీసుకున్న స్పష్టమైన నైతికమైన నిర్ణయానికి పనామా దేశ ప్రభుత్వ స్పందన ప్రశంసనీయమన్నారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ దేశ, ప్రపంచ దేశాల భద్రత కోసం మన దేశం తీసుకుంటున్న చర్యలకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. సమావేశంలో ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించామని తెలిపారు.



పనామా దేశ అధ్యక్షుడు జోస్‌రౌలీములినితో అఖిలపక్ష బృందంలో పాల్గొన్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

సీఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

- హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఇంటెలిజెన్స్ అధికారి, ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, మే 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ నెల 31న సీఎం చంద్రబాబు ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో పర్యటించనున్నందున అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి ఎక్కడా లోటుపాట్లు చోటు చేసుకోకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి క్షేత్రస్థాయిలో గురువారం ముందస్తు ఏర్పాట్లను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, ప్రాంతీయ ఇంటిలిజెన్స్ అధికారి కృష్ణారావు, జిల్లాస్థాయి అధికారులతో కలిసి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ పర్యటన నిర్వహించారు. ముందుగా సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. చెయ్యేరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.9లక్షల88వేలతో చేపట్టిన చెరువు పూడికతీత అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. స్థానికంగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ వేదిక ఏర్పాట్లను పరిశీలించి చెయ్యేరు జడ్పీ ఉన్నత పాఠశాల వెనుకభాగంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికను పరిశీలించారు. అనంతరం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి గుడి వద్ద పార్టీ కేడర్‌తో సమావేశమయ్యే స్థలాన్ని వారు పరిశీలించారు.

బాలికపై అత్యాచారం

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వైనం 7
- పోక్సో కేసు నమోదు

అంతర్వేదిలో రంగా విగ్రహం తొలగింపుపై వివాదం

- ఉద్రిక్తత.. రోడ్డుపై బైఠాయించిన నాయకులు 7

అన్నవరం దేవస్థానం ఏఈవోపై సీఎంవోకు ఫిర్యాదు

7


'మహాసైకిల్'


సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు

మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం




కొమరగిరి పెద్ద చెరువులో చేపలు పడుతున్న దృశ్యం (పాత చిత్రం)

రుచి అమోఘం

వింటే భారతం వినాలి... తింటే గారెలే తినాలి అనే సామెత పాతదైనా ఆ గ్రామానికి చెందిన చెరువు చేపను సంవత్సరానికి ఒకసారైనా తినాలనే కోరికతో కొత్తపల్లి మండల ప్రజలు ఉవ్విళ్లూరుతుంటారు. దాంతో చేపలు పట్టే రోజుకి చేతుల్లో డబ్బులు లేకపోయినప్పటికీ అప్పోసొప్పో చేసి లేక ఏదైనా వస్తువు తాకట్టుపెట్టి మరీ చేపలు కొనుగోలు చేయడం విశేషం.


సంధువాలు

- కొమరగిరి పెద్ద చెరువు చేపలకు డిమాండ్
- వస్తువులను తాకట్టు పెట్టయినా సరే కొనాల్సిందే
- సంవత్సరానికి ఒకసారే పట్టుబడి


6 కిలోల బరువున్న వాలుగు చేప

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని కొమరగిరిలో సుమారు 250 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు ఉంది. ఇందులో సంవత్సరానికి ఒకసారే చేపలు పట్టుబడి పడతారు. పంచాయతీకి చెందిన ఈ చెరువును స్థానికంగా మకాం ఉండే పల్లీలు లీజుకు తీసుకుని చేపలు పండిస్తారు. ప్రతి సంవత్సరం జూన్ నెల దాటాక చెరువు చేపల్లో మంచివైన రాగండి, బొచ్చు, గడ్డి, చెరువు సంధువాలు, ఎర్రమైల, వాలుగు తదితర రకాలకు చెందిన చేపల పిల్లలను వేస్తారు. మరలా మే నెల వచ్చే వరకు ఆ చెరువు వద్దకు పల్లీలు వెళ్లరు. అంతేగాక చేప పిల్లలకు ఎటువంటి ఆహారం వేయరు. చెరువులో ఉండే గడ్డి, నాచు, తూటికాడ, పొన్నగంటి కూరలను ఆహారంగా తింటాయి. సుమారు సంవత్సరం పాటు పెరిగిన చేపలు ఒక్కొక్కటి ఐదు నుంచి 8 కిలోల బరువు పెరుగుతాయి. వాటిని వారంలో రెండు లేక మూడు రోజులు పట్టుబడి పడతారు. కిలో రూ.130 చొప్పున తొలుత గ్రామ ప్రజలకు టోకెన్ల ద్వారా అమ్ముతారు. వారు వాటిని కొనుగోలు చేసి పొరుగూళ్లలో వున్న బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖులకు పంపిస్తారు. ఆ తర్వాత వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు కిలో రూ.150 చొప్పున విక్రయిస్తారు. ఎటువంటి మేత (ఆహారం) వేయకుండా కేవలం గడ్డి, తూటికాడ, పొన్నగంటి కూరలను మేతగా తిన్న చేపల రుచి అమోఘంగా ఉంటుందని ఇక్కడి ప్రజలు చెప్తున్నారు. ఈ చేపలను వేపుడు లేదా పులుసు చేసుకుని మాంసాహారప్రియులు లొట్టలేసుకుని తింటారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కొమరగిరి చెరువులో చేపలు ఎప్పుడు పడతారా అని బంధువులను ఆరా తీయడం గమనార్హం.


కొమరగిరి చెరువు వద్ద చేపల కొనుగోలుకు గుమిగూడిన ప్రజలు (పాత చిత్రం)


ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

కాకినాడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ కేడర్లలో 8,839 మంది వివరాలు నమోదు చేసుకున్నారు. వారిలో 4,352 మంది ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారున్నారు. 4,487 మంది రిక్వెస్ట్ పెట్టుకున్నారు. హెచ్ఎంలకు సంబంధించి సీనియారిటీ జాబితా, అభ్యంతరాల స్వీకరణ ఇప్పటికే పూర్తయ్యింది. బుధవారం వెబ్ ఆప్షన్లు కూడా తొలగించడంతో వారంతా తదుపరి ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసే పనిలో విద్యా శాఖ నిమగ్నమైంది. శుక్రవారం నాటికి కొలిక్కివచ్చే అవకాశముంది. జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ప్రచురిస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఉద్యోగోన్నతులకు 252 మంది స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న 111మంది హెచ్ఎంలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్టు కాకినాడ జిల్లా డీఈవో రమేష్ తెలిపారు.

కేటగిరీ	తప్పనిసరి బదిలీ	రిక్వెస్ట్	మొత్తం
ప్రధానోపాధ్యాయులు	66	179	245
స్కూల్ అసిస్టెంట్లు	2217	2368	4585
ఎస్జీటీలు	2069	1940	4009

సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్, జేఎన్టీయూకే మధ్య ఎంవోయూ


అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ, సీసీఎండీఆర్సీ ప్రతినిధులు

జేఎన్టీయూకే, మే 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్, జేఎన్టీయూకే మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ హెచ్ భారతి హొల్లికేరి ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా వర్శిటీలోని ఐఆర్సీలో సెంటర్ ఫర్ సెన్సస్ మైక్రోడేటా పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించామని, దీనికి యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్ జీవీఎస్ఆర్ దీక్షితులు నోడల్ అధికారిగా నియమితులయ్యారన్నారు. భారతి హల్లికేరి మాట్లాడుతూ జనగణనను ఇప్పటివరకు 15సార్లు చేపట్టామన్నారు. కొవిడ్ కారణంగా 16వ జనగణన చేపట్టలేదని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ హోమ్ అఫైర్స్ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ శశికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుప్రెజ్, రెక్టార్ కేవీ రమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు బాలకృష్ణ, కృష్ణప్రసాద్, పద్మజారాణి, గోపాలకృష్ణ, మాజీ వీసీలు శ్రీనివాస్‌కుమార్, పద్మరాజు పాల్గొన్నారు.


మహీరమ రాసిన నవలను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ

మహీరమ కలం నుంచి ఆంగ్ల ఫిక్షన్ నవల

ఆవిష్కరించిన నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన చల్లా మహీరమ ఆసక్తికర కథనంతో ఆంగ్ల ఫిక్షన్ నవల రాసి రికార్డు సృష్టించిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. 13 ఏళ్ల మహీరమ రాసిన 'రూబీస్ బ్లూ స్ట్రీమ్ అండ్ ది బాండ్ ఆఫ్ ఫైర్' నవలను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు చల్లా వెంకట సుబ్బరాయశాస్త్రి మనుమరాలైన మహీరమ ప్రకృతి, పంచభూతాల కథాంశంగా ఫిక్షన్ నవల రాసిందన్నారు. ఆరవ ఏట వరకు అమెరికాలో పెరిగిన మహీరమ తండ్రి రోషన్‌కృష్ణ ఉద్యోగరీత్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో 9వ తరగతి చదువుతోందని తెలిపారు. రచయిత్రి మహీరమ మాట్లాడుతూ... ప్రకృతితో మానవుడి అనుబంధం, ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తే కలిగే పర్యవసానాలు, జీవితగమ్యాన్ని ఈ రచన ద్వారా చెప్పానన్నారు. తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, తాత, మామ్మలకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహీరమ తల్లి సాయిసుధ, అమ్మమ్మ, తాతయ్య గోపాలమ్మ, ఏపీఎస్ రాజు, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొంచెమే పెంపు



ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం

- క్వింటాలుకు రూ.69 పెంపు
- గ్రేడ్ ఏ రకం రూ.2,369
- సాధారణ రకం రూ.2,252
- ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
- పెదవి విరుస్తున్న రైతులు

సామర్లకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): మే నెలలో ధాన్యానికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెరిగింది. క్వింటాలుకు రూ.69 పెరిగింది. గతేడాది గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,320గా కేంద్రం ప్రకటించగా ఈ ఏడాది మరో రూ.69 పెంచడంతో రూ.2,369కి చేరింది. సాధారణ రకం ధాన్యం రూ.2,183 ఉండగా ఈ ఏడాది రూ.69 ప్రక టించడంతో రూ.2,252కి చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో సీఏసీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బుధవారం సాయంత్రం కనీస మద్దతు ధరలను ప్రకటించింది. తాజా మద్దతు ధరతో రానున్న 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేయాల్సిఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5.54 లక్షల ఎకరాల పరిధిలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ప్రభావం లేకపోతే ఎకరాకు వరికి 4.5 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటాలుకు రూ.69 పెంచడంతో ఉమ్మడి జిల్లాలో రైతులకు రూ.180కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

సాగు ఖర్చులతో పోలిస్తే...

వరి మొక్కజొన్న తదితర 16 పంటలకు సంబంధించి మద్దతు ధరలను పెంచుతూ వ్యవసాయ, వ్యయ ధరల కమిషన్ (సీఏసీపీ) కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. పెసలు కనీస మద్దతు ధరను 10.4 శాతం మేర పెంచి రూ.8,768గా నిర్ణయించింది. గతేడాది పెసలు క్వింటాలుకు రూ.8,682గా ఉంది. పెసలపై 8 శాతం పెంచగా, వరికి కేవలం 6 శాతం మాత్రమే పెంచింది. ఈ పెంపుదల ధరలు వరికే అత్యధికం అని కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ పెరి గిన సాగుఖర్చులుతో పోలిస్తే ఇది ఏమంత అధికం కాదని రైతులు చెప్తున్నారు. ఈ సిఫార్సులను కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో సాధారణ రకం, గ్రేడ్ ఏ రకాలకు ప్రస్తుతం చెల్లిస్తున్న ధర కంటే రూ.69 చొప్పున పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 330 ధాన్యం కొనుగోలు కేంద్రాల వరకూ ఏర్పాటు చేసి ప్రభుత్వం గతంలో ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాలకు అనుగుణంగా కొనుగోలు చేపట్టలేకపోగా రానున్న ఖరీఫ్ నాటికి 5.54 లక్షల ఎకరాల్లో సాగు ద్వారా వచ్చే 16.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది. ఇక ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.69 మాత్రమే పెంపుదల చేయడంతో రైతాంగం పెదవి విరు స్తుంది. సాగుకు పెట్టుబడులు అధికమవుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా మద్దతు ధర లభించడం లేదని రైతులు, రైతు సంఘాల ప్రతి నిధులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం అయినా చేయకుండా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తుందని పాలక ప్రభుత్వాలపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు

మొక్కజొన్న క్వింటాకు రూ.175
కందులు క్వింటాకు రూ.450
మినుములు క్వింటాకు రూ.400
వేరుశెనగ క్వింటాకు రూ.480
పత్తి క్వింటాకు రూ.589

చేతి చమురు వదిలించుకోవాల్సిందే...

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన వరిపంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినా, ఏటా మిల్లర్లు రైతులకు మద్దతు ధర అందివ్వని పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని అందజేస్తున్నా, తమకు మాత్రం మద్దతు కరువవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభిప్రాయం ఎకరాకు సగటున 48 బస్తాల వరకూ దిగుబడులు వస్తాయని వ్యవ సాయ శాఖ అంచనా వేయగా క్వింటాలుకు కేం ద్రం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి 2,389 ప్రకారం బస్తాకు రూ.1,791.75 వస్తుంది. మొత్తం 48బస్తాలకు రూ.86,004 వస్తుంది. కానీ ఎకరానికి పెట్టుబడిగా రూ.70వేల వరకూ పెట్టుబడి వ్యయం అవుతుండగా, రైతుకు మిగి లేది కేవలం 16,004 మాత్రమే. అదే రైతు కూలీ పనులకు వెళితే పంట సాగుకాలంలో రూ.80 వేల వరకూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. అది కూడా ఏ-గ్రేడ్ రకానికి మాత్రమే సొంతభూమి సాగు చేసుకునే రైతుకు కొంత మిగులు కనిపి ంచే అవకాశం ఉండగా కౌలు రైతు, ప్రభుత్వం ముద్దుగా పిలుచుకొనే సాగుహక్కుదారుడు చేతి చమురు వదిలించుకోవాల్సిందే. సాధారణంగా ఖరీఫ్‌లో సాగు హక్కుదారులకు ఏమీ మిగలదు. రబీలో లాభం ఉంటుందనే ఆశతోనే సాగులోకి దిగుతారు. అన్ని అవరోధాలను దాటుకుని సాగు చేసినా చేతికి మిగిలేది రెండు పదులు కూడా దాటని పరిస్థితి. అయితే మద్దతు ధర గణనీయంగా పెరిగితేనే రైతులకు ఎంతోకొంత మిగులుతుంది.



ఎట్టకేలకు.. హెచ్చరిక బోర్డు



అన్నవరంలో పంపా తీరం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం వద్ద పంపా కొలనులో దిగి యువకుడు మృతిచెందిన సంఘటన విధితమే. అయితే స్వామివారి కల్యాణోత్సవ చక్రస్నానం కోసం ఏర్పాటుచేసిన కొలను ఈ ప్రమాదానికి కారణమైంది. దీంతో కార్యక్రమం ఈనెల 12తో ముగిసినా కొలను వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో నిండుప్రాణం బలైంది. దీంతో అధికారులు గురువారం పంపా తీరం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఆరడుగుల.. గోధుమ తాచుపాము హల్‌చల్

అంబాజీపేట, మే 29 (ఆంధ్రజోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట విజ్ఞపు వెంకటరాజు ఆయిల్ మిల్లులో ఆరడుగుల గోధుమ రంగు తాచుపాము గురువారం భయభ్రాంతులను గురిచేసింది. దీంతో వెంకట్రాజు స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో అతడు అక్కడకు చేరుకుని రేకుల కింద ఉన్న తాచుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు. ఆ పాము దూరప్రాంతంలో విడిచిపెడతాననని వర్మ తెలిపాడు.



అంబాజీపేటలో తాచుపామును పట్టుకున్న వర్మ

అన్నవరం దేవస్థానం
ఏఈవోపై సీఎంవోకు ఫిర్యాదు

- శ్రీపుష్పయోగం రోజున భక్తురాలిపై అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు
- ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి విచారణాధికారిని నియమించిన ఈవో

అన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆలయ విభాగ ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండలరావుపై ఒక భక్తుడు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం రత్నగిరిపై చర్చనీయాంశమైంది. సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల ముగింపు శ్రీపుష్పయోగం రోజున ఏఈవో కొండరావు ఒక మహిళపై దురుసుగా ప్రవర్తించడంతో పాటుగా తాకరాని ప్రదేశంలో చెయ్యిపెట్టి తోసేశారని ఫిర్యాదు చేయడంతో సీఎంవో కార్యాలయం విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించింది. దీంతో ఈవో వీర్ల సుబ్బారావు అతనిని ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి విచారణాధికారిగా దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌ను నియమించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల దేవస్థానంలో సేవ చేసేందుకు విచ్చేసిన సేవకుల పై కూడా ఏఈవో దురుసుగా మాట్లాడడంతో దేవదాయ కమిషనర్ విచారణకు ఆదేశించిన సంగతి విధితమే. మరో నెలరోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆయన ఈ విధంగా ప్రవర్తించడం, వివాదాలకు కారణమవుతుండడంతో ఆలయఉద్యోగులు దీనిపై చర్చించుకుంటున్నారు.

ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

గర్భవతిని చేసి పరారైన యువకుడిపై పోక్సో కేసు నమోదు

కె.గంగవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని ఓ గ్రామంలో బాలికను అదే గ్రామానికి చెందిన మందపల్లి సాగర్ అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారం చేశాడు. బాలిక ప్రస్తుతం 7 నెలల గర్భవతి. దీనిపై పామర్రు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. డీఎస్పీ రఘువీర్, అమలాపురం మహిళా ఎస్ఐ గంగాభవానిలు బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మందపల్లి సాగర్ తను నివాసం ఉంటున్న కాలనీలోని ఓ మైనర్‌ను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని అడుగుతుంటే కుదరదని చెబుతూ ఉన్నాడు. బాలిక కుటుంబీకులు స్థానిక పెద్దలను ఆశ్రయించారు. అక్కడ వారికి న్యాయం జరగకపోవడంతో పామర్రు పోలీసులను ఆశ్రయించారు. గురువారం సాయంత్రం రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, పామర్రు ఎస్ఐ. ఎస్‌కె జానీ బాషా, అమలాపురం మహిళా ఎస్ఐ గంగా భవానీలు బాధితురాలి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. అయితే సాగర్ పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద
రక్తపు గాయాలతో వ్యక్తి హల్‌చల్

జగ్గంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం రక్తపు గాయాలతో హల్‌చల్ చేశాడు. వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి జగ్గంపేటలో బాలాజీ రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేసుకుని రోడ్డుపై వెళ్తున్నవారితో అసభ్యంగా ప్రవరిస్తున్నాడని స్టేషన్‌లో అందిన సమాచారం ప్రకారం సిబ్బంది అతడి వద్ద ఫోన్‌ను తీసుకొచ్చారు. దీంతో ఆ వ్యక్తి స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులు దౌర్జన్యం నశించాలంటూ గాజు పెంకుతో ఒంటిపై కోసుకుని రక్తపు గాయాలతో ఉండగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయితే తను వద్ద నుంచి ఫోన్, రూ.50వేలు నగదు పోలీసులు తీసుకున్నారని సదరు వ్యక్తి వాపోతున్నాడు.



పోలీస్‌స్టేషన్ వద్ద హల్‌చల్ చేస్తున్న వ్యక్తి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
WANTED
★ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ని, పిల్లలను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. ఏజెంట్స్ కూడా కావలెను. జీతం: 15k, ఏజెంట్ కమీషన్ : 5k. ఫోన్: 8977517749 AJH-6753
4 Lines CLASSIFIED Rs.230/- Only

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. హంసవరం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఏ ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు. సంబంధికులెవరైనా ఉంటే రైల్వే పోలీసులను, రైల్వే ఫోన్ నెంబర్ 9490619020లో సంప్రదించాలని కోరారు.



హంసవరం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సీఎం పర్యటనకు శరవేగంతో పనులు

- ముమ్మిడివరం నియోజకవర్గంలో రేపు చంద్రబాబు పర్యటన
- సిద్ధమవుతున్న ప్రజా వేదిక

ముమ్మిడివరం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంతో సాగుతున్నాయి. ఈ నెల 31న ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగమంతా అక్కడే ఉండి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహిపాలచెరువు, పల్లంకుర్రు ఆర్అండ్‌బీ రోడ్డును సీహెచ్ గున్నేపల్లి నుంచి చెయ్యేరు వరకు రోడ్డుపక్కన ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తీసివేసి శుభ్రం చేస్తున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యేందుకు సీహెచ్ గున్నేపల్లిలోని పాత ఓఎన్జీసీ సైట్‌లో ఉన్న కొబ్బరి పీచును తొలగించి హెలిప్యాడ్‌ను ఆధునికీకరిస్తున్నారు. అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రజావేదికకు సీఎం కాన్వాయ్ వెళ్లేందుకు హెలిప్యాడ్ నుంచి మెయిన్‌రోడ్డుకు రోడ్డును ఆధునికీకరిస్తున్నారు. చెయ్యేరులో నిర్వహించే ప్రజా వేదికకు సంబంధించి వేదికను సిద్ధం చేస్తున్నారు. అక్కడ రోడ్లు కూడా ఆధునికీకరిస్తున్నారు. పేదల సేవలో భాగంగా ముగ్గురు పేదలను దత్తత తీసుకునే కార్యక్రమానికి సంబంధించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ప్రజావేదికలో గ్రామస్థులతో మాట్లాడిన తరువాత ఉపాధిహామీ పథకంలో చెయ్యేరు ఆధునికీకరిస్తున్న చెరువును పరిశీలించి అక్కడ ఉపాధిహామీ కూలీలతో సీఎం మమేకమవుతారు. అక్కడ ఎంపికన చేసిన నలుగురి పెన్షనర్లతో మాట్లాడనున్నారు. మెయిన్ రోడ్డు నుంచి చెరువు వరకు రోడ్డును ఆధునికీకరించి అక్కడ భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి ఆలయ సమీపంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడేందుకు వేదికను ఏర్పాటు చేస్తున్నారు.



చెయ్యేరులో ప్రజా వేదికను సిద్ధం చేస్తున్న దృశ్యం



సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

భారీ బందోబస్తు..

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలు బస చేసేందుకు ముమ్మిడివరంలోని కల్యాణ మండపాలను సిద్ధం చేశారు. పోలీసు బలగాలంతా ముందురోజే ఇక్కడకు చేరుకోనున్నాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, రిజర్వుడు ఇనస్పెక్టర్లు ముగ్గురు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు 64 మంది, ఏఎస్‌లు, హెచ్‌సీలు, పోలీసు కానిస్టేబుళ్లు 492 మంది, మహిళా పోలీసులు 67 మంది, హోంగార్డులు 88 మంది మొత్తం 751 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాక ఆర్మ్డ్ రిజర్వ్ పార్టీ 35 మంది, ఎనిమిది స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీఎం పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కొడవలిలో వివాహిత ఆత్మహత్య



మరణించిన నాగమణి

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కొడవలి ఎస్సీ కాలనీకి చెందిన నామా నాగమణి (44) కుటుంబసమస్యలతో ఇబ్బందిపడుతోంది. బుధవారం రాత్రి ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆత్మహత్య చేసుకుందని చెప్తున్నారు. అయితే నాగమణి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని సామర్లకోట మండలం హుస్సేన్‌పురానికి చెందిన ఆమె సోదరి పుప్పాల సూర్యమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మహేష్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మరణించాడు. అడ్డతీగల మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన బూడిద మహేష్ (33) గురువారం కరెంటు పనులు చేస్తున్నాడు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సమయంలో హెచ్‌టీ లైన్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర ంగా గాయపడ్డాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. మహేష్ సోదరి మరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ద్రాక్షారామ మే 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు చీమల దిబ్బలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన శీలం కమల(43) మృతి చెందింది. ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుయ్యేరు గ్రామం నుంచి ద్రాక్షారామలో వేడుకకు ఆమె మరో వ్యక్తితో కలిసి మోటారుసైకిల్‌పై బయలుదేరారు. ఇరుకైన రహదారిలో వాహనం గోతిలో పడడంతో వెనుక కూర్చున్న కమల జారి రోడ్డుపై పడింది. అదే సమయంలో ద్రాక్షారామ నుంచి కుయ్యేరు వెళ్తున్న లారీ ఆమె పైనుంచి వెళ్లడంతో వెనుకచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

వై.రామవరం, మే 29(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెం ప్రధాన రహదారిలో ఈనెల 25న ఆర్టీసీ బస్సు, మోటారు బైక్ ఢీకొని ఇద్దరు యువకులు గాయపడిన విషయం విధితమే. కాగా వీరిలో పనసలపాలెనికి చెందిన పల్లాల నాగిరెడ్డి(22) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతదేహనికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మృతిచెందిన పల్లాల నాగిరెడ్డి

రంగా విగ్రహాలు.. రగిలిన ఆందోళనలు!

- అంతర్వేదిలో రంగా విగ్రహం తొలగింపుపై వివాదం, ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన నాయకులు
- కొత్తపల్లిలో రంగా విగ్రహం చేతులు విరగొట్టిన వైనం



ధర్నా చేస్తున్న నాయకులు, మహిళలు, గ్రామస్తులు



అంతర్వేది కొత్తపేటలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహం

అంతర్వేది, మే 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొత్తపేట సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఒక వర్గంవారు రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. మరొక వర్గంవారు విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించి పోలీసులకు తెలియచేయడంతో పోలీసులు తెల్లవారుజామున విగ్రహాన్ని తొలగించారు. దీంతో ఆగ్రహించిన కాపు సంఘాల నాయకులు, గ్రామస్తులు విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ తరుణంలో పోలీసులు, రంగా అభిమానులకు మధ్య తోపులాట జరిగింది. రాజోలు నియోజకవర్గ నాయకులు, కాపు సంఘాల నాయకులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి రంగా విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటుచేయాలని నినాదాలు చేశారు. పోలీసులవో వాగ్వాదం చేస్తూ రంగా విగ్రహాన్ని తీసిన చోటే గ్రామస్తులు పెట్టారు. ఈ తోపులాటలో రంగా విగ్రహం చేయి విరిగింది. అనంతరం విగ్రహానికి దండలు వేసి కాపు సంఘ నాయకులు, మహిళలు ధర్నా చేశారు. ఉదయం 6 గంటల నుంచి ఇరువర్గాలతో చర్చలు జరుపగా అమలాపురం ఆర్డీవో మాధవి, డీఎస్పీ మురళీమోహన్ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోసం ఎదురుచూడ సాగారు. మధ్యాహ్నానికి ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఇరువర్గాల నుంచి చెరొక ఐదుగురు సభ్యులను స్థానిక పంచాయతీ భవనంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి వారితో మాట్లాడి పరిస్థితులు చేజారిపోకుండా శాంతింపచేశారు. అన్నివర్గాల నాయకుల విగ్రహాలకు ఇబ్బంది లేకుండా విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, దిమ్మ, నిర్మాణాలు సక్రమంగా అవతల వారి డిమాండ్ల మేరకు విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇచ్చి ఇరువర్గాలతో శాంతియుతంగా చర్చలు జరిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, రాజోలు సీఐ నరేష్‌కుమార్, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం ఎస్ఐలు పటిష్ఠ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. సీఐ నరేష్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ధర్నా

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఊరచెరువు సెంటర్లో కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహం చేతులు విరగొట్టిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన, రంగా యూత్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఇటీవల సెంటర్లో ఉన్న రంగా విగ్రహం చేతి వేళ్లను గుర్తు తెలియని వ్యక్తి విరగొట్టాడని, గురువారం తెల్లవారుజామున విగ్రహం చేతి మణికట్టు వద్ద విరగొట్టి పక్కనే ఉన్న చెరువులో విసిరేశారని జనసేన, రంగా యూత్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ విగ్రహాన్ని పరిశీలించి నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. జనసేన నాయకులు కొణమర్తి రాంబాబు,ఆటో పెద్ద, భరత్, రాజారావు, మోకా పెద్దకాపు, బాబులు, మామిడాల రమణ, మోహనరంగాయూత్ సానా లోవరాజు, గంధం గంగ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జనసేన, రంగా యూత్ సభ్యులు



కొత్తపల్లిలో రంగా విగ్రహం చేతులు విరగొట్టిన దృశ్యం

బైండోవర్

అమలాపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గూడాలలో మద్యం అమ్మకాలు నిర్వహించే వానపల్లి కృష్ణాజీని అదుపులోకి తీసుకుని అమలాపురం తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ రూ.లక్ష ష్యూరిటీ విధించారన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పి.గన్నవరం, మే29(ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మండల పరిషత్, సచివాలయ ఉద్యోగులు యోగా చేశారు.

శరవేగంగా ఈదరపల్లి వంతెన పనులు



ఈదరపల్లిలోని శరవేగంగా జరుగుతున్న ప్రధానవంతెన నిర్మాణ పనులు

అమలాపురం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): రూ.4కోట్ల అంచనా వ్యయంతో ఈదరపల్లి, నడిపూడి గ్రామాల్లో బెండా కెనాల్‌పై చేపట్టిన వంతెనల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 12వ తేదీన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రతిష్టాత్మకంగా వంతెన నిర్మాణ పనులకు భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. బొబ్బర్లంక రహదారి 1/10 కిలోమీటరు వద్ద మైనరు బ్రిడ్జి (ఈదరపల్లివంతెన), ముక్కామల లాకు రహదారి 2/2 కిలోమీటరు వద్దమైనరు బ్రిడ్జి (నడిపూడి వంతెన) పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది అమలాపురం పట్టణాన్ని ఆనుకుని మరో ఐదు వంతెనల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే ఆనందరావు ముందుగానే ప్రకటించడం విశేషం. గత వైసీపీ ప్రభుత్వంలో వంతెనల నిర్మాణాలు కేవలం ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమయ్యాయి. దశాబ్దాల కాలంనాటి ఈదరపల్లి వంతెన వద్ద నూతన వంతెన నిర్మాణంతో పాటు ఆక్రమణల తొలగింపుపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణంలో భాగంగా బెండా కెనాల్‌కు ఆనుకుని నడిపూడి డాబా గార్డెన్ మీదుగా ప్రత్యేక తాత్కాలిక వంతెన నిర్మించారు. అయితే అటుగా వాహనాలు వెళ్లేందుకు స్థానికులు రెండు రోడ్డు మార్గాలకు అడ్డంకులు సృష్టిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి నూతన కమిటీ



అమలాపురంలో ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి సమావేశంలో పాల్గొన్న నాయకులు

అమలాపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన కమిటీని ఏపీ రైతుసంఘం జిల్లా కోఆర్డినేటర్ కొప్పుల సత్తిబాబు ప్రకటించారు. అమలాపురంలో గ్యాస్, చమురు, ఖనిజ, ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి ప్రతినిధుల సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని వెల్లడించారు. జిల్లా కన్వీనర్‌గా ఉండవల్లి గోపాలరావు, కోకన్వీనర్‌గా గండి ఏసుదాసు, జిల్లాకమిటీ సభ్యులుగా జాలెం సుబ్బారావు, రాపాక రత్నరాజు, వంటెద్దు వెంకన్నాయుడు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, బండారు రామ్మోహనరావు, దేవ రాజేంద్రప్రసాద్, పులపర్తి సురేష్‌లను నియమించారు. కమిటీ పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించింది. సహజ వనరులు ప్రజల ఆస్తి అయినందున వారికి యాజమాన్య హక్కు కల్పించాలన్నారు. చమురు సహజవాయువు కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుచేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. నగరం గ్రామ సమగ్రాభివృద్ధి చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని సత్తిబాబు ప్రకటించారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రవికుమార్

- అఖిలభారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి రవికుమార్

అమలాపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు రావద్దని అఖిలభారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. జిల్లాలో విద్యారంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. అమలాపురంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య కొరవడిందన్నారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలకు చేరుకుని మూడు దశాబ్దాలు గడిచిందన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారన్నారు. మండపేట పట్టణంలో వంద మంది విద్యార్థులు ఉన్నా ప్రాథమిక పాఠశాల రెండు గదులతో నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. రామచంద్రపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నిధులు విడుదల లేక పునాదులకే పరిమితం అయిందన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించి జిల్లాలో పర్యటించాలని ముఖ్యమంత్రికి సూచించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు వెంకట్, నాయకులు సతీష్, సందీప్, సాయిరామ్, నూకన్న ప్రసాద్, కుమార్, శ్యామ్, సురేష్, సుహాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలలు నిరసన తెలపాలి

ముమ్మిడివరం, మే 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణచేసి ఎస్సీలకు తీరని అన్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాలలంతా నిరసన చేయాలని వైసీపీ కోనసీమ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి పిలుపునిచ్చారు. ఈనెల 31వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు పర్యటనలో జిల్లాలోని మాలమహానాడు శ్రేణులు, దళిత సంఘాలు అధిక సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలియజేయాలన్నారు. సీఎం చంద్రబాబు పర్యటనలో రాజ్యాంగ బద్ధంగా నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందన్నారు.

యోగాతో ఏకాగ్రత

రాజోలు, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యోగా పదో రోజు గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులతో ట్రైనింగ్ మాస్టర్ చంద్రశేఖర్ యోగాసనాలు వేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ పనుల కారణంగా ప్రతీ ఒక్కరూ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్వీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పాలు



ఐ.పోలవరం, మే 29(ఆంధ్రజ్యోతి): ఎంతో అందంగా చూడముచ్చటగా ఉండే మే పుష్పాలు మురమళ్ల కాళేవారి వీధిలోని కాళే వెంకటరత్నం ఇంట్లో వికసించాయి. మే పుష్పాలు చూడముచ్చటగా అందరినీ కనువిందు చేశాయి. ఈ పుష్పాలను గురువారం వీరేశ్వరస్వామి ఆలయానికి సమర్పించారు.

ఒంటిమిట్ట రాముడికి ఎమ్మెల్యే బండారు పూజలు

కొత్తపేట, మే 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరామస్వామిని గురువారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దర్శించుకుని పూజలు జరిపారు. అలాగే తిరుమల తొలిగడపగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తర్వాత మహానాడుకు తరలివెళ్లారు.

6వేల మంది రైతులతో యోగా

- అమలాపురం బాలయోగి స్టేడియంలో రైతులతో యోగా
- పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి
- వందలాది మంది హాజరు





సామూహిక యోగాసనాలు కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్



యోగాసనాలు వేస్తున్న అధికారుల, రైతులు, మహిళలు

అమలాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలతో యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. శ్వాసపై ధ్యాసతో ఆరోగ్యాన్ని సుసంపన్నం చేసే యోగాను ప్రతీ వ్యక్తికి చేరువ చేసే లక్ష్యంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6వేల మంది రైతులతో యోగా అభ్యసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో గురువారం ఉదయం వందలాది మంది రైతులతో యోగా అభ్యసన కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. యోగా గురువులు ఆయుష్ వైద్యుల ద్వారా ఘనంగా రైతులతో అభ్యసన కార్యక్రమాలను సువిశాలమైన ప్రాంగణంలో నిర్వహించారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో యోగా ఆచరణతో దేహ దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతతను సొంతం చేసుకోవాలన్నారు. ప్రతీరోజు 15 నిమిషాల నుంచి ప్రారంభించి దశలవారీగా గంట పాటు యోగాసనాలను అలవరచుకోవాల్సిందిగా కలెక్టర్ ఉద్బోధించారు. జిల్లా వ్యాప్తంగా ఈకార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతీ కుటుంబానికి ప్రతీ వ్యక్తికి యోగాను చేరువ చేసేందుకే యోగాంధ్ర కార్యక్రమాలను 26రోజులు 26 ఇతివృత్తాలతో అమలు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ప్రతీ ఒక్కరూ యోగాను అలవరచుకోవాల్సిందిగా సూచించారు. భారతీయ వారసత్వ సంపదగా ప్రసిద్ధి గాంచిన యోగాను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ యోగాంధ్ర 2025ను ప్రారంభించడం ప్రజలు అదృష్టంగా భావించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగాసనాలు నిర్దేశిత ఇతివృత్తాలతో ఆచరిస్తూ యోగేంద్ర అభినయంలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా వీటికి ప్రచారం కల్పించాల్సిందిగా సూచించారు. జూన్ 2న రంగోళి పోటీలు, 4న గ్రామ, మున్సిపల్, ప్రభుత్వ అధికారుల ద్వారా మేజర్ ఈవెంట్లు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పర్యాటక, దేవాలయాల్లో కూడా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. యోగా అభ్యసన కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి విజయ్‌కుమారి, డీఆర్వో రాజకుమారి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, డీఈవో సలీంబాషా, వ్యవసాయాధికారి బోసుబాబు, డీఆర్డీఏ పీడీ గాంధీ, డ్వామా పీడీ మధుసూదన్, యోగా గురువు ప్రసాద్, రైతులు, స్వయం సంఘాల సభ్యులు, ఉపాధి కూలీలు, పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని యోగా అభ్యసనాలను చేశారు.

అమలాపురం చేరుకున్న దివ్యాంగుల ఉపకరణాలు



అమలాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న దివ్యాంగుల ఉపకరణాలు

అమలాపురం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు అంబాజీపేట మండలంలోని దివ్యాంగులకు ఈదరపల్లిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఇటీవల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్లు, ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలను అందించేందుకు పరీక్షలు నిర్వహించారు. వారి అవసరాన్ని బట్టి వాహనాలు, ఉపకరణాలు అందించేందుకు ఇప్పటికే అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఉత్తరప్రదేశ్ నుంచి దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్లు, ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలు అమలాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈదరపల్లి కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపకరణాలను ఈదరపల్లిలోని కమ్యూనిటీ హాలు, మండలపరిషత్ కార్యాలయాల్లో భద్రపరిచారు. త్వరలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు తెలిపారు.

చంద్రబాబును కలిసిన రీజెన్సీ అధినేత నాయుడు



సీఎం చంద్రబాబుతో రీజెన్సీ అధినేత జీఎన్ నాయుడు

యానాం, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజులు జరిగిన టీడీపీ మహానాడులో రీజెన్సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబునాయుడుతో జీఎన్‌నాయుడు వేదికపై, అంతరంగిక సమావేశ మందిరంలో వివిధ అంశాలపై ముచ్చటించారు. ఉమ్మడి బాపట్ల జిల్లా వేమవరం వద్ద నూతనంగా గత ఏడాది ప్రారంభించిన రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ టైల్స్ ఉత్పత్తి తదితర అంశాలపై చర్చించుకున్నారు. విజయవాడ వచ్చినప్పుడు తనను కలవాలని సీఎం చంద్రబాబు సూచించారని జీఎన్ నాయుడు తెలిపారు. ప్రపథమంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో కడపలో జరిగిన మహానాడు అపూర్వ ఘట్టంగా పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని నాయుడు పేర్కొన్నారు.

మొక్కల పంపిణీ

మలికిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మేలు చేసేవిధంగా తన సోదరుడు వలవల సత్తిరాజు జ్ఞాపకార్థం జీబీ టెక్ సంస్థ మొక్కలు పంపిణీ చేయడం ప్రశంసనీయమని మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి అన్నారు. మోరిపోడు గ్రామంలోని 200మందికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేసీఎంఎల్ శ్రీనివాస్, డాక్టర్ జేన వీరభద్రప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, పెద్దిరెడ్డిసుబ్బారావు, ముప్పర్తి త్రిమూర్తులు, వలవల దొరబాబు, నిమ్మగడ్డ గెద్దయ్య, ముప్పర్తి బాబు, మాలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సహకార సిబ్బందికి చెక్కుల పంపిణీ

రాయవరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాల రూపంలో మంజూరైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. సహకార సంఘం సీఈవో రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస పాల్గొని సిబ్బందికి చెక్కులను పంపిణీ చేశారు. ఎనిమిది మంది సిబ్బందికి జీతాల రూపంలో 1లక్షా 74వేల 900 రూపాయలు మంజూరుకాగా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు శాకా కోటేశ్వరరావు, నిమ్మకాయల మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయ్‌హోల్కర్ జయంతి



అహల్యాబాయిహోల్కర్ గొప్పదనాన్ని వివరిస్తున్న చీకురుమెల్లి వెంకటేశ్వరరావు

మామిడికుదురు, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ అహల్యాబాయి హోల్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని చైతన్యవంతం కావాలని బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు సూచించారు. అహల్యాబాయ్‌హోల్కర్ జయంతి వేడుకలు పాశర్లపూడి గ్రామంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగాయి. కార్యక్రమంలో చీకురుమెల్లి వెంకటేశ్వరరావుతో పాటు బీజేపీ మహిళామోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ హోల్కర్ చరిత్రను మహిళలకు వివరించారు. 300ఏళ్ల క్రితమే మహిళలను చైతన్యపరిచి వారికోసం అనేక కార్యక్రమాలను రూపొందించి దేశ సంస్కృతిని కాపాడిన పవిత్రమూర్తి హోల్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, గాడి సత్తిబాబు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, కోటిపల్లి సాయిబాబు, యాండ్ర అబ్బాస్, కోటిపల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి దేశ సంస్కృతిని కాపాడిన అహల్యాబాయ్‌హోల్కర్ 300 జయంతిని గంగలకుర్రు, మొసలపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆమెను మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చ ఇన్‌చార్జ్ మోకా ఆదిలక్ష్మి తెలిపారు. కముజు శ్రీనివాస్, చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, మే29(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లిబాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి గురువారం మొగలికుదురుకు చెందిన ములికికోట సత్యసాయిరామ్-విజయలక్ష్మికోటేశ్వరి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. అలాగే నగరం గ్రామానికి చెందిన మడకల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వామివారి సన్నిధిలోని గోశాలకు 45మోపుల ఎండుగడ్డిని అందించారు. దాతలను ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు అభినందించారు. గురువారం స్వామివారిని 2200మంది భక్తులు దర్శించుకుని వెయ్యి మంది అన్నప్రసాదం స్వీకరించారని, రూ.1,23,532 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ తెలిపారు.

సోమలింగేశ్వరస్వామి కల్యాణం

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ర్యాలి గుడిమెరక వీధిలోనున్న పురాతన పార్వతీ సమేత ఉమాసోమలింగేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణాన్ని శివనామస్మరణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పి.గన్నవరం, మే 29(ఆంధ్రజ్యోతి): రావిలంకలో వశిష్ట నదీ పాయలో బాలురు మృతి చెందిన ఘటనలో నాగుల్లంకలో బాధిత కుటుంబాలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు పరామర్శించారు. స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో సంసాని పెద్దిరాజు, యల్లమిల్లి చిట్టిబాబు, శేరు శ్రీనుబాబు, గుడాల వెంకటరమణ, చికిలే డేవిడ్‌రాజు, అర్థాని ఏడుకొండలు, సిరా రత్నకుమార్, చెవల దాసు, నూకల విశ్వేశ్వరరావు, చికిలే రత్నంరాజు, యార్లగడ్డ ప్రభాకర్, ఆరుమిల్లి రాంబాబు, గుబ్బల వెంకటేశ్వరరావు, బాపనయ్య, దార దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా గాజులగుంట

పి.గన్నవరం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా మండలంలోని గాజులగుంటను సారా రహిత గ్రామంగా ప్రకటించారని కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయిని తెలిపారు. గాజులగుంటలో గురువారం అధికారులు, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్పంచ్ ఎస్.లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి టీవీ రమణ, వీఆర్వో కె.దుర్గావరలక్ష్మి, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు పాల్గొని గ్రామాన్ని నాటుసారా రహిత గ్రామంగా ప్రకటించి ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రామచంద్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పనరామునిలంకలో సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

మలికిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): అప్పనరామునిలంక మధ్య గ్రూపులో విద్యుత్ సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నామని, అదేవిధంగా శ్మశాన వాటిక కావాలని గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను వారు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బందెల శరత్, బీవీ రత్నం, దిడ్ల శ్రీనివాస్, కె.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 7వరకు సెంటాక్ గడువు పెంపు

యానాం, మే 29(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ (సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును జూన్ 7వ తేదీ వరకు పొడిగించినట్టు పుదుచ్చేరి సెంటాక్ అధికారులు ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీఎస్సీ, బీపీటీ, అగ్రికల్చర్ తదితర పారామెడికల్ కోర్సులు, ఆర్ట్స్, సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని గతంలో ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ గడువును జూన్ 7వరకు పొగిడించారు. వివరాలకు సెంటాక్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పి.గన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 1991-92లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఆ నాటి గురువులను ఘనంగా సన్మానించి పాదాలకు మొక్కారు. ఆ రోజుల్లో పాఠశాలలో చేసిన అల్లర్లు, తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉల్లాసంగా గడిపారు. కాలం అన్ని మరిచిపోయేలా చేస్తుంది కానీ... కాలాన్ని కూడా మరిచిపోయేలా చేసేది నిజమైన స్నేహమని ఒకరికి ఒకరు తమ స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు.

వినియోగదారుల సంఘ సమావేశం



మాట్లాడుతున్న మాలే శ్రీనివాసనగేష్

మలికిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులు-పరిరక్షణ ప్రయోజనాలే లక్ష్యంగా సంఘాలు పనిచేస్తున్నాయని మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. గురువారం మలికిపురం పంచాయతీ కార్యాలయంలో జరిగిన వినియోగదారుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య సముదాయాల్లో వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్ట్ కౌన్సిలర్ మెంబర్‌గా మాలే శ్రీనివాసనగేష్‌ను నియమించడం పట్ల సమావేశం ఆయన్ను అభినందించింది. సమావేశంలో పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. గెడ్డం ఫిలిప్‌రాజు, బోనం వెంకటేశ్వరరావు, నల్లి శివకుమార్, గుబ్బల బాలకృష్ణలను నూతన సభ్యులుగా నియమించారు. సమావేశంలో కె.వేణు, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం పేర్రాజు, దిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్‌కు సత్కారం

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ర్యాలి సబ్ పోస్టుమాస్టర్ ఎస్.తమ్మారావు పదోన్నతిపై రాంచీకి అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా వెళ్తున్నారు. రిటైర్డ్ పోస్టుమాస్టర్ గట్టి బ్రహ్మాజీ అధ్యక్షతన సత్కారసభ నిర్వహించారు కామేశ్వరరావు, ఉమా దేవి తదితరులు ఆయన్ను సత్కరించారు.

వెంకన్న లక్ష తులసీ పూజా మహోత్సవానికి విరాళం

అంబాజీపేట, మే 29(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి వార్షిక లక్షతులసీ పూజా మహోత్సవానికి చెరుకూరి రామచంద్రరావు-పద్మావతి దంపతులు రూ.25వేలు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు, కమిటీ సభ్యుడు మేడిద చిన్న పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్ద పండుగ

మలికిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల వద్ద జూన్ 1 నుంచి పండుగ వాతావరణంలో ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తారని టీడీపీ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నానిలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండడానికి ధరల డీలర్ల వ్యవస్థను ప్రారంభిస్తున్నారని అన్నారు. గత వైసీపీ హయాంలో వేలాది కోట్లు ఎండీయూల పేరుతో దుర్వినియోగం చేయడంతో పాటు రేషన్ మాఫియాకు ద్వారాలు తెరిచారన్నారు. వాటన్నింటినీ నిరోధించి ప్రజలకు తమకు అనుకూలమైన రోజుల్లో నిత్యావసర వస్తువులు పొందడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కపిలేశ్వరపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రిసోర్స్‌పర్సన్ డి.తారకవంశీ ఆధ్వర్యంలో పోటీలు జరిపారు. సోషల్ మీడియా వరమా-శాపమా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 30మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయాధికారిణి డి. శివకుమారి తెలిపారు. గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాణా అందజేత

రాయవరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో అర్హులైన పాడి రైతులకు గురువారం సబ్సిడీపై దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన అధ్యక్షుడు శాకా నాగేంద్ర మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఎస్ఐడీసీ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆయా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రైతులకు 50 కిలోల దాణా బస్తాను 50 శాతం సబ్సిడీపై 555 రూపాయలకే అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE

I, **BALLA SHARON ROSE** W/o Anand Joshi D.no.9-184, Sakhinetipalli Village, Sakhinetipalli Mandal Dr. B.R.Ambedkar Konaseema Dist. AP-533251. I Hence by declare tha my name has been Changed from **BALL JOSHI SARAN ROSE** (old name) to **BALLA SHARON ROSE** (New Name). Hence all my document and correspondence will continue with my new name of **BALLA SHARON ROSE.**

పాస్‌పోర్ట్ పడిపోయినది

పెచ్చెట్టి నాగసత్యనారాయణ S/o దేవేశ్వరరావు D.no. 7-15 గుడిమెళ్ళంక గ్రామ కాపురస్తులైన నేను ది. 20-05-2025వ తేదిన ఇంటిదగ్గర నుండి మలికిపురం సెంటర్‌కు నా పాస్‌పోర్ట్ నెం. W2699611 గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ తీయించుటకు వెళ్ళినపుడు మార్గ మధ్యలో జారిపడిపోయినది. దొరికిన వారు తెలియజేయగలరు.

పెచ్చెట్టి నాగ సత్యనారాయణ
కీ.శే దేవేశ్వరరావు, గుడిమెళ్ళంక
మలికిపురం మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
Cell: 6281078172

మండపేట

సైఫాన్ నిర్మాణంతో ట్రాఫిక్ మళ్లింపు

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల వద్ద సైఫాన్ నిర్మాణ పనులు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్డును తొలగించి పైపులైనును నిర్మించడంతో రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. బొబ్బర్లంక మీదుగా వాడపల్లి చేరుకునే భక్తజనం ధవళేశ్వరం, వేమగిరి మీదుగా రావులపాలెం నుంచి వాడపల్లి చేరుకోవాలని వారంటున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులు రావులపాలెం మీదుగా వాడపల్లి చేరుకోవాలని ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.



లొల్ల వద్ద సైఫాన్ నిర్మాణంతో రోడ్డును తవ్వేసిన దృశ్యం



కపిలేశ్వరపురం పుష్కరఘాట్ వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో

హెచ్చరికల బోర్డుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కపిలేశ్వరపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరి నది ప్రాంతంలో లోతు అంచనా తెలియకపోవడం తో ఇటీవల పలువురు మృత్యువాతపడ్డారు. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో ఒక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, కేదార్లంక, అద్దంకివారిలంక, పుష్కర ఘాట్లు, నారాయణలంకలో ఫిషర్‌మన్ రేవు వద్ద వీటిని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పి.చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ చిన్నారావు, ఆర్ఐ అర్జమ్మ, వీఆర్వో రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు పూర్తి చేయరూ..



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బాలికలతో పాటు, శ్రమటీం సభ్యులు

కపిలేశ్వరపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): నల్లూరు ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలంటూ పాఠశాల విద్యార్థులు, చైల్డ్ కలెక్టివ్ పిల్లలు, శ్రమ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ శారద గురువారం గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. యాభై ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాల పైకప్పు బీటలు తీసి పెచ్చులూడిపోవడం, గోడలు బీటలు వారడం గ్రహించిన ఉపాధ్యాయులు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు తెలిపారు. దీంతో 2022 ఆగస్టు 20న సుమారు 51,99,917 లక్షల గ్రాంటుతో 8 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందన్నారు. మూడేళ్లు గడుస్తున్నా నేటికీ బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఈ పాఠశాలలో 147 మంది విద్యనభ్యసిస్తున్నారని అదనపు తరగతుల నిర్మాణం పూర్తి చేయాలంటూ పలుసార్లు సర్పంచ్, కార్యదర్శికి, హెచ్ఎంకు వినతిపత్రాలు ఇచ్చామని శ్రమ ఆర్గనైజర్ శారద తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ కలెక్టివ్ విద్యార్థులతో పాటు, శ్రమ టీం సభ్యులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్య పుస్తకాలు

ఎంఈవో సూర్యనారాయణ

రాయవరం, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, బ్యాగ్, బెల్ట్, బూట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మండల కేంద్రాల్లో స్టాక్ పాయింట్లకు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. రాయవరం మండలం పరిధిలో ఉన్న పాఠశాలలకు ఈ వారంలో పాఠ్య పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

తగ్గిన పుస్తకాల బరువు: రానున్న విద్యా సంవత్సరం నుంచి 1, 2 తరగతులకు మొదటి సెమిస్టర్ అన్ని సబెక్టులు కలిపి ఒక్కొక్కటి చొప్పున పుస్తకం, వర్క్‌బుక్ ఉంటుంది. రెండో సెమిస్టర్‌లో అన్ని సబెక్టులకు కలిపి మరో పుస్తకం, ఒక వర్క్‌బుక్ ఉండనుంది. గతంలో 1, 2వ తరగతుల విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు, లెక్కలు వర్కుబుక్ కలిపి నాలుగు పాఠ్య పుస్తకాలు ఉండేవి. 3 నుంచి 5వ తరగతి వరకు 8 పుస్తకాల స్థానంలో నాలుగు పుస్తకాలను తీసుకువచ్చారు. మిగిలిన తరగతుల్లో పుస్తకాల సంఖ్యను తగ్గించడంతో విద్యార్థులు బ్యాగ్‌ను చాలా తేలికగా బడికి తీసుకువెళ్లే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థిని, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాయవరం మండలం పరిధిలో 12 గ్రామాల్లో 48 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 3,156 పాఠ్య పుస్తకాలు, 2,912 బ్యాగ్‌లు స్టాక్ పాయింట్‌కు చేరుకున్నట్లు ఎంఈవో వై.సూర్యనారాయణ తెలిపారు.

ఆహార భద్రతపై వ్యాపారులకు శిక్షణ తప్పనిసరి

ఫుడ్ సేఫ్టీ అధికారి కేశవ దుర్గాప్రసాద్

రామచంద్రపురం మే 29 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతపై వ్యాపారులు తప్పనిసరిగా శిక్షణ పొందాలని ఫుడ్ సేఫ్టీ అధికారి కేశవ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని అక్షయ ఇన్‌లో ఏర్పాటు చేసిన ఆహార భద్రతా శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆహార వ్యాపారులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. ఆహార కల్తీ జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి కె.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హోటల్ వ్యాపారులు ఆహార తయారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా ఫోస్టాక్ ఫీల్డ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్స్ ఆనందకుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఆహార భద్రతపై నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న అధికారులు

అహల్యాబాయ్ హోల్కర్‌కు పలువురు నివాళి

ఆత్రేయపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): అహల్యాబాయ్ హోల్కర్ జయంతిని గురువారం ఆత్రేయపురంలో నిర్వహించారు. మహిళల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు యు.వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన జయంతి కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ రాష్ట్ర నాయకులు శిష్టా కుటుంబరావు, ఆకుమర్తి బేబీరాణి, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, కాలబత్తుల చిన్నారి తదితరులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో అహల్యాబాయ్ హోల్కర్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

జూన్ 2న లీలాకృష్ణ ప్రమాణ స్వీకారం

మండపేట, మే 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వేగుళ్ల లీలాకృష్ణ జూన్ 2న విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని జనసేన నియోజకవర్గ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2న ఉదయం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర జలవనరుల నిర్వహణ రైతు శిక్షణ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు దీన్ని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

మండపేట, మే 29(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మండల స్టాక్ పాయింట్‌ను మండపేట గౌతమీ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ మమ్మీ గురువారం స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. మండలానికి చేరుకున్న విద్యార్థిమిత్ర కిట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీఎంశ్రీ స్కూలు పనులు జరుగుతున్న పాఠశాల ఆవరణను ఆమె పరిశీలించారు. తాపేశ్వరం, కేశవరం హైస్కూళ్లలో జరుగుతున్న ప్లే ఫీల్డ్ పనులను ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు ఏఎల్‌సీ జిల్లా కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు ఎన్.రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి, సీఆర్ఎంటీలు శేషారావు, నారాయణరావు, వెంకటలక్ష్మి, రామభద్రం పాల్గొన్నారు.



కడపలోని ఒంటిమిట్ట రాములవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

ఒంటిమిట్ట రాముడికి ఎమ్మెల్యే బండారు పూజలు

కొత్తపేట, మే 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరామస్వామిని గురువారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దర్శించుకుని పూజలు జరిపారు. అలాగే తిరుమల తొలిగడపగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారంతా మహానాడుకు తరలివెళ్లారు.

కడప అమీన్ పీర్ దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే: టీడీపీ మహానాడుకు కడప వెళ్లిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం కడపలోని అమీన్ పీర్ దర్గాను దర్శించుకున్నారు. దర్గా పెద్దలు ఆయన్ను సాదరంగా ఆహ్వానించగా ప్రార్థనలు చేశారు.



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారిణి శివకుమారి

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కపిలేశ్వరపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రిసోర్స్‌పర్సన్ డి.తారక్‌వంశీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిపారు. సోషల్ మీడియా వరమా-శాపమా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 30 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సోమేశ్వరం సహకార సంఘం వద్ద పీపీసీ సిబ్బందికి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

సోమేశ్వరం సొసైటీ వద్ద పీపీసీ సిబ్బందికి చెక్కుల పంపిణీ

రాయవరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాల రూపంలో మంజూరైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. సహకార సంఘం సీఈవో రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస పాల్గొని సిబ్బందికి చెక్కులను పంపిణీ చేశారు. ఎనిమిది మంది సిబ్బందికి జీతాల రూపంలో 1లక్షా 74వేల 900 రూపాయలు మంజూరుకాగా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు శాకా కోటేశ్వరరావు, నిమ్మకాయల మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, మే 29(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి నిత్యాన్నదాన పథకానికి గురువారం మొగలికుదురుకు చెందిన ములికికోట సత్యసాయిరామ్,విజయలక్ష్మికోటేశ్వరి దంపతులు విరాళం ఇచ్చారు. గురువారం స్వామివారిని 2200 మంది భక్తులు దర్శించుకోగా, రూ.1,23,532 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ తెలిపారు.



రావులపాలెం వద్ద మురుగునీటితో కంపుకొడుతున్న ప్రధాన పంటకాలువ. పక్క చిత్రంలో గోపాలపురం లాకుల వద్ద మురుగునీటితో కంపుకొడుతున్న ప్రధాన పంట కాలువలోని నీరు

కలుషితమవుతున్నా పట్టించుకోరా..?

• ప్రధాన పంట కాలువల్లో మురుగునీరు మళ్లిస్తున్న స్థానికులు • చోద్యం చూస్తున్న అధికారులు

రావులపాలెం, మే 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో కాలువలను ఆధునీకరించి ఖరీఫ్ నాటికి పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ 15 తరువాత కాలువలకు నీరు విడుదల నిలిపివేస్తారు. జూన్ మొదటి వారంలో కాలువలకు నీటిని విడుదల చేయగానే సమీప గ్రామాల్లోని మహిళలు కాలువ రేవుల వద్ద కొత్తనీటికి హారతులు పట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు. ఇప్పుడు ఆయా కాలువల్లో దుర్గంధం వెదజల్లే మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రావులపాలెం మండల పరిధిలోని ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, రావులపాడు, వెదిరేశ్వరం, పొడగట్లపల్లి, గోపాలపురం తదితర గ్రామాల్లోని గృహాల వాడకం నీటిని నేరుగా కాలువల్లోకి ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు డ్రెయిన్లు కూడా ప్రధాన పంట కాలువల్లోకి మళ్లించడంతో కలుషితమవుతున్నాయి. కాలువలు మూసివేసి నెల రోజులు గడుస్తున్నప్పటికి ఆయా ప్రాంత కాలువలు ఆరలేదు. అక్కడి ప్రధాన పంట కాలువల్లోకి మురుగునీరు చేరి నీలిరంగులోకి మారి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల బెడద పెరిగిపోయింది. ప్రధాన పంట కాలువల్లోకి నేరుగా మురుగునీరు పైపులను ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు విడుదల కాకముందే పంట కాలువల్లో ఏర్పాటు చేసిన ఇళ్లలోని వాడకంనీరు పైపులను తొలగించాలని వారు కోరుతున్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,77,057 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి కాకినాడ రూరల్ చీడిగ గ్రామానికి చెందిన ఉలిశెట్టి భానునాగ వెంకట సత్యనారాయణ, కనకదుర్గ వరలక్ష్మి దంపతులు రూ.51వేలు విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందచేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు. పక్క చిత్రంలో దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతున్న దృశ్యం

కోటిపల్లిలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

కె.గంగవరం, మే 29(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి బీసీ కాలనీలోని దుర్గాదేవి ఆలయ పదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలతో అందంగా తీర్చిదిద్దారు. గ్రామంలోని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వంక రామకృష్ణశర్మ, పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

యోగాతో ఆరోగ్యం పదిలం

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు పార్క్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా అభ్యాసకులు వారికి శిక్షణ ఇచ్చారు. వ్యవసాయశాఖ అధికారి భార్గవ మహేష్, వైద్యాధికారులు సందీప్, జ్యోతి, ఆయుర్వేద వైద్యాధికారిణి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో యోగా శిక్షకులు వెంకట్రాజు ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు.



సోమేశ్వరంలో రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులకు సబ్సిడీపై దాణా అందజేత

రాయవరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అర్హులైన పాడి రైతులకు గురువారం సబ్సిడీపై దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన అధ్యక్షుడు శాకా నాగేంద్ర మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఎస్ఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆయా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రైతులకు 50 కిలోల దాణా బస్తాను 50 శాతం సబ్సిడీపై 555 రూపాయలకే అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట ఎమ్మెల్యే బండారును అభినందిస్తున్న మంత్రి లోకేశ్

కొత్తపేట ఎమ్మెల్యే బండారుకు మంత్రి లోకేశ్ అభినందనలు

రావులపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలిశారు. ఇటీవల కొత్తపేట నియోజకవర్గంలో నియమించిన మండల కమిటీల్లో యువతకు ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో లోకేశ్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



ప్రత్యేక అలంకరణలో ర్యాలి సోమలింగేశ్వరస్వామివారు

సోమలింగేశ్వరస్వామి కల్యాణం

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ర్యాలి గుడిమెరక వీధిలోనున్న పురాతన పార్వతీ సమేత ఉమాసోమలింగేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణాన్ని శివనామస్మరణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్‌కు సత్కారం

ఆత్రేయపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ర్యాలి సబ్ పోస్టుమాస్టర్ ఎస్.తమ్మారావు పదోన్నతిపై రాంచీకి అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా వెళ్తున్నారు. రిటైర్డ్ పోస్టుమాస్టర్ గట్టి బ్రహ్మాజీ అధ్యక్షతన సత్కారసభ నిర్వహించారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, ఉమాదేవి తదితరులు ఆయన్ను సత్కరించారు.

దస్తావేజులు పోయినవి

రాయవరం మండలం మాచవరం గ్రామానికి చెందిన రొంగల లక్ష్మణరావు అనే నేను ఏప్రియల్ 5వ తేదిన మాచవరం నుండి రామచంద్రపురం వెళుతుండగా నాకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు నెం.2959/70 మరియు 274/1975 మార్గమధ్యంలో పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియపచగలరు.

రొంగల లక్ష్మణరావు, మాచవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ-ధర్మదాయ శాఖ

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, వాడపల్లి

ఈ-టెండరు ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, యొక్క ఈ క్రింది పనులు నిమిత్తం టెండరు పిలవబడుచున్నది.

వ. నెం	పని వివరములు	ఎస్టిమేట్ ఖర్చు మొత్తం
1	Construction of Radha sala	రూ..38,00,000/-
2	Providing Roof with Polycarbonate sheet for shed Infront of annaprasada building	రూ. 10,00,000/-
3	శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వాడపల్లి (గ్రా), ఆత్రేయపురం(మం), డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నందు మాడవీధిలో నైరుతి భాగమున రెండు పాత ఇల్లు నిర్మాణములు (buildings-గతంలో అర్చకుల నివాసం) dismantling చేసి, వున్నది ఉన్నట్టుగా నేల మట్టం చేసి, materials బయటకు transport చేసి site క్లియర్ చేసి ఇచ్చు పద్ధతిన ఎంత సొమ్ము దేవస్థానమునకు చెల్లించగలవారు అనే దానిపై సీల్డ్ టెండర్స్ కోరబడుచున్నవి. సీల్డ్ టెండర్స్ దేవస్థానం కార్యాలయం నందు **ది:18-6-2025, సాయంత్రం గం:03.00 PM** గంటల వరకు స్వీకరించబడును. తదుపరి అదేరోజు 3:30 PM గంటలకు అందరి సమక్షంలో కార్యనిర్వాహణాధికారిచే తెరవబడును. హెచ్చు పాటదారుడు, quote చేసిన సొమ్మును దేవస్థానమునకు వెంటనే చెల్లించి, పని ప్రారంభించి 7 రోజులలో తొలగించవలెను. పాటను ఏ కారణములు తెలుపుటకు, రద్దు చేయుటకు పూర్తి అధికారం కార్యనిర్వహణాధికారికి కలదు.	

బిడ్ డాక్యుమెంట్ **తేది 29-05-2025 ఉదయం గం.10.00 AM** నుండి **ది.18-06-2025 ఉదయం గం.10.00 AM** వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండరు దాఖలు చేయుటకు ఆఖరి **తేది.18-06-2025 ఉదయం గం: 10.30 AM** వరకు మాత్రమే, మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడవచ్చును.

Dt:29-05-2025,
వాడపల్లి

సం/- డిప్యూటీ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి